మౌనముల భాష

అరిగె రామారావు

కమల హాలులోంచి వీధిలోకి, వీధిలోంచి హాలులోకి కాలుగాలిన పిల్లిలాగా తిరుగుతుంది.

వరండాలో కూర్చుని రైలు బండితో ఆటలు ఆడుకుంటున్న పెద్ద కొడుకు ప్రకాష్‌ను, 'ఏరా, పోస్ట్‌మెన్ వచ్చాడురా?' అని అడిగింది.

'ఆ, వచ్చాడు. ఇదిగో నీ వుత్తరం' అని నిక్కరు జేబులోంచి 'వుత్తుత్తి' వుత్తరం బయటికితీసి చేయిజాచి పకపక నవ్వాడు.

ఇంకో సమయంలో అయితే కొడుకు నెత్తుకొని ముద్దులాడి వుండేది కాని, యిప్పుడుమాత్రం 'అల్లరి వెధవ!' అని గట్టిగా కసురుకుంది. వాడు వికృత మొగం వేశాడు.

వరండాలో వాలు కుర్చీలో కూర్చుని వారపత్రిక చదువుకుంటున్న సుందరి ప్రకాష్‌వంక జాలిగా చూచింది. పోస్టు కోసం కమలక్కయ్య పడే కంగారును ఇందాకట్నుంచి ఒక కంట కనిపెట్టు తూనే వుంది. ఈవిడ్డి మరీ చోద్యం. పిల్లాడు నవ్వులాటలకు అంటే, మరీ అంత యిదిగా కసురుకోవాలి కాబోలు. వాళ్ళాయన దగ్గర్నుంచి పెద్ద లావు వుత్తరం తనకే వస్తుంది కదా అని మహా పెద్ద యిది. ఇందాకట్నుంచి వూరికే చిందులు తొక్కుతుంది— అని అనుకుంది సుందరి, 'తరువాయి 22 వ 'పేజీ'ని పత్రికలో వెదుక్కుంటూ.

హాలులో పూలు గుచ్చుకుంటున్న రెండో చెల్లెలు అరుణను, 'ఏమే, అరుణా! పోస్ట్‌మాన్‌గాని వచ్చి వెళ్ళాడా?' అని అడుగుతుంది కమల.

'పెద్ద బడాయి' అనుకుంది సుందరి పత్రిక పేజీలు మడుస్తూ.

'ఏమోనక్కా, నేను చూడలేదు' అంది అరుణ.

'ఇరవై నాల్గంటలూ నీకు పూలతోనే సరిపోయే! నీకింకేం పట్టుతుంది?' అసహనంగా అంది కమల. పాపం అరుణ చిన్నబుచ్చుకుంది.

'అస్తమానమూ నీవు బావ రాసే వుత్తరాలకోసం ఎదురుచూడటంలేదు! అదీ అంతే!'

కమల వాళ్ళాయన దగ్గర్నుంచివచ్చే వుత్తరంకోసం పడే ఆరాటాన్ని చూస్తూ వుంటె సుందరి మనసు కుతకుతలాడి పోతుంది. 'మరీ బడాయి—' 'మరి చోద్యం,' 'పెద్ద యిది' అని కమలను గురించి ఈ కాసేపటిలో ఎన్నిసార్లు అనుకుందో లెక్కలేదు.

పెళ్ళయి ఏడు సంవత్సరాలు దాటుతున్నా, ముప్పైఏళ్ళు మీద పడుతున్నా మూడో కాన్పుకు పుట్టింటికొచ్చిన కమలక్కయ్యకు బావకు మధ్య ఎడతెరపి లేకుండా ప్రేమ లేఖలు నడుస్తున్నందుకు సుందరికి కంటగింపుగా వుంది. తనకెందుకా కంటగింపు అంటే తనకే అర్థంకాదు. తన మనస్సును సమాధాన

పెట్టుకుని; మనస్సులోంచి ఆ కంట గింపును తుడిచివేయాలనుకుంటుంది. కాని, ప్రతిరోజూ నాగాలేకుండా కమలక్కయ్య బావ దగ్గర్నుంచి వుత్తరాలు అందు కోవటం. సమాధానాలు రాయటం చూస్తూ వున్నంతసేపు అది సాధ్యపడటం లేదు.

తనకుకూడ ప్రేమ లేఖలు రాసి, పుచ్చు కునే అవకాశము వుంటే అక్కయ్య ప్రేమ లేఖల భాగోతం తన గుండెలమీద సమ్మెట పోటులాగా వుండకపోను. కనీసం తన పంధొమ్మిదేళ్ల జీవితంలో 'ప్రేమలేఖ'ను ఒక్కసారి తన కళ్లతో చూచివున్నా తని ప్పుడు ఇంత బాధపడి వుండకపోను — ఆ ప్రేమలేఖ తనకు రాసినది కాకపోయినా సరే! తను స్కూల్లో చదువుకునే రోజుల్లో తన స్నేహితురాలు సుధ వాళ్ల ప్రక్కింటి అబ్బాయితో ప్రేమ సాగిస్తూ వుండేది. యిద్దరూ ప్రేమలేఖలు రాసు కుంటూ వుండేవాళ్ళు. అది రోజూ తమ 'ప్రేమచేష్టలు' అన్నీ వివరంగా పూస గ్రుచ్చినట్లు చెప్పేది. కాని, ఒక్కసారి కూడ తనకొచ్చే ప్రేమలేఖను చూపించేది కాదు. అక్కడికీ తనొకసారి నోరు తెరచు కుని అడిగితే, ఎవరికీ చూపించనని పట్టు పెట్టానే అని దాటవేసింది.

తను మెట్రిక్కు ట్యూషన్ చదువు కుంటున్న రోజుల్లో సుబ్బారావు అనేవాడు ఒకసారి తనకు తెలియకుండా తన జామెంట్రిబాక్సులో ప్రేమలేఖ రాసి పెట్టాడు. దాన్ని తను కళ్లతోకూడ చూడలేదు. ఈ మహాతల్లే (కమల) బ్లేడు కోసం పెట్టెతీసి చూచి యింట్లో అందరికీ చూపించి గొడవ గొడవ జేసింది. నాన్నగారు ఆ సుబ్బారావును వాళ్లనాన్నను జడ్జి హోదాలో పిలిపించి క్షమార్పణ చేడించాడు. ప్రేమలేఖ రాయగలిగిన ఫూల్ చేతికి ధైర్యంగా యివ్వకూడదా అని ఆ సుబ్బారావును ఆ రోజుల్లో చాలరోజులుదాక మనస్సులో తిట్టుకుంది.

సుందరి బలవంతంగా మనస్సును చేతి కోని వారపత్రికమీద లగ్నం చేసింది — అనిత (అసలు ఇలాటి పెక్కు పేరు పెట్టిన రచయిత్రిగారి కెంత టెక్కో అని అనుకుంది సుందరి!) ఆ సుపత్రిలో స్పెషల్‌రూంలో పురిటి మంచంమీద కూర్చుని భర్త సునిల్‌కుమారుకు (బెంగాలీ దిగుమతి!)— బాబుకు అన్నీ మీ పోలికలే వచ్చాయి అని అంటూ, ఆ నాలుగురోజుల పసికందు రూపురేఖలు వర్ణించి వుత్తరం రాస్తోంది.

—ఏడవకపోయింది. పురిటి మంచంమీద కూర్చుని కూడ మొగుడికి వుత్తరం రాయాలి? ఏం. స్నానం అయ్యేవరకు ఆగగూడదు? ఛీ, పాడు మనుషులూ, పాడు కథలూనూ.

పత్రికను విసురుగా అవతల పారేసింది. ఇంతలో బయట్నుంచి, 'పోస్ట్' అని కేక వినిపించింది. హాలులో తలదువ్వు కుంటున్న కమల అలా జుట్టు విరబోసు కొనే వీధిలోకి పరుగెత్తటం సుందరి చూచింది.

అదేమిటి పోలేరమ్మలాగా అలా జుట్టు విరబోసుకుని వీధిలోకి పరుగెత్తుతుంది. ఛీ, ఎవరన్నా ఏమన్నా అనుకుంటారని కూడ లేదూ! అరెరె, మీద పమిట జారిపోతున్నా చూచుకోకుండా వుత్తరం చూచుకొని ఓ మురిసిపోతూ గదిలోకి వెళ్లి తలుపులు గడియ పెట్టుకుందే! తలుపులన్నీ బిగుంచుకోనిగాని వుత్తరం చదువకూడదు కాబోలు! బయట అందరూ చూస్తూవుండగా చదువుకుంటే ఎవరన్నా చేతిలో వుత్తరం లాక్కుంటా రని భయమా? ఛీ పాడు, ఏం మనిషి!

సీతమ్మ (కమలా, సుందరీ వాళ్లమ్మ గారు) వచ్చి 'ఏమే సుంది, మీ ఆయన ఇవ్వాళ మధ్యాహ్నం భోజనానికి యిక్కడికే వస్తానన్నాడు కదూ!' అని అడిగింది.

'ఆఁ—' సుందరి నిర్లిప్తంగా సమా ధానం యిచ్చింది.

'అన్నట్లు అతడు కాకరకాయ వేపుడు తింటాడు కదూ! అదే అడుగుదామని—'

సీతమ్మ మళ్లీ వంటింట్లోకి వెళ్లి పోయింది.

సుందరి కళ్లు మూసుకుంది. తన మనోలోకంలోకి వెళ్లిపోయింది. ఆమె ఆలోచనలు ఇలా సాగాయి;

మధ్యాహ్నానికి భోజనానికి వస్తాడా అని అడుగుతుంది. ప్రతిపూటా హాజరు వేయించుకోకుండా ఎక్కడికి పోతాడు? మహాతల్లి—దేశావుగా సమ్మంధం—వున్న వూళ్లో సమ్మంధం, వున్నవూళ్లో సమ్మంధమని; నాన్నగారికిష్టంలేక పోయినా పట్టుబట్టి; రెండోదయినా వున్న వూళ్లో చూడాలను కున్నప్పుడల్లా కళ్ల పడుతుందని యమతాపత్రయ పడిపోయా వుగా! తానో పిచ్చచచ్చింది. రెండు వీధుల అత్తగారిల్లు. ఇవతల పుట్టిల్లు. కావలసు కుంటె పొయ్యిమీద ఎసరుపెట్టి అన్నం వుడికేలోపల అమ్మగారింటికెళ్లి రావచ్చని అప్పట్లో వూరికే మురిసిపోయింది.

వున్నవూళ్లో సమ్మంధం చేసుకోవటం వల్ల ఆడపిల్లల ఎన్నో సరదాలు తీరని సరదాలుగా అందుకోలేని గగన కుసుమా లుగా, తీరని వ్యధలుగా మిగిలిపోతాయని అనుభవంమీద తెలుసుకున్నది; పెళ్లయిన కొద్దిరోజులకే! ఎక్కడిదాకనో ఎందుకు ముచ్చటగా మొగుడూపెళ్లాలు ఒక్క వుత్తరంముక్క రాసుకుంటానికి లేదుగా తనలో తొలి యావనం మొగ్గ తొడిగినప్ప ట్నుంచి; వయస్సు ప్రోదిచేసిన ప్రేమ వూహలు తీవలు సాగినప్పట్నుంచి, తనూ ప్రేమలేఖలను అందుకోవాలి, ప్రేమలేఖలు రాయాలి అనే కోరిక తన లేత గుండెల్లో మెల్లమెల్లగా తావు జేసుకుని ఈ నాటికి అది గుండెలమీది పెద్ద బరువుగా నిలిచి పోయింది. పెళ్లయిన తర్వాత ఆ కోరిక తీరుతుంది అని అనుకుంటె వున్న వూళ్లో సమ్మంధం అవటం వల్లన అది తీరని కోరికలాగే మిగిలిపోయింది...

నిండా అరగంట గడిచిన తర్వాత కమల కళ్లనిండా వెలుగులు నింపుకుని గది తలుపులు తీసికొని బయటికి వచ్చింది. అనిర్వచనీయమైన ఆనందం ఆమెను విలు వెల్లా వూపివేస్తోంది.

అక్కయ్య ఎంత అదృష్టవంతురాలు అనుకుంది సుందరి. పాతపడినా పచ్చి చావని ప్రేమ బావది. పరోక్షంలో కూడా ప్రతి క్షణం తననే మనస్సులో నిలుపుకుని, తన లోని ప్రతి భావాన్ని, ప్రతి స్పందననూ ఏరోజు కారోజు వుత్తరాల ద్వారా భార్యకు నివేదించుకునే భర్తను కలిగి వుండటం కంటె స్త్రీకి కావల్సినదేముంది?

అలా అని సుందరి భర్త రాజారావు భార్య అంటె ప్రేమలేనివాడా అంటె అదీ కాదు. భార్యంటె ఎనలేని ప్రేమ. ఆ విషయం సుందరికి కూడా తెలుసు. కాని, వచ్చిన చిక్కల్లా ఎక్కడ వచ్చిందంటె సుందరికి తన చిరకాల వాంఛితం నెర

వేరే మార్గం కనిపించటం లేదు. పెళ్ళయి సంవత్సరము దాటుతున్నా భర్తకు ఒక్క ప్రేమ లేఖ రాసే అవకాశము కూడ కలగలేదు. పెళ్ళయిన దగ్గర్నుండి తననే అంటిపెట్టుకుని వుంటె ఎలా రాస్తుంది. అక్కడికీ ఒకసారి చీకటితో భర్త కంటె ముందుగా లేచి, ఆ రోజు సాయంత్రం సినిమాకెళ్లాలి అనే ప్రతిపాదనను అందంగా, అందమైన అక్షరాలతో ఒక చీటి రాసి టేబిల్ మీద పెట్టింది. రాజారావు మొగం కడుక్కుని వచ్చి ఆ చీటిని చూచి మొగం చిరాకుగా పెట్టి, 'ఎదురుగా మనిషి వుంటె చెప్పకుండా ఈ చీటీల్లు ఏమిటి అసహ్యంగా!' అన్నాడు. సుందరి అంతటితో నీళ్ళు కారిపోయింది.

ఈ పద్ధతి లాభం లేదనుకుని మరొక విధంగా ఆ అవకాశాన్ని సృష్టించుకోవాలనుకుంది. అందుకనే వారంరోజుల క్రిందట సూట్‌కేసులో బట్టలు సర్దుకుని పుట్టింటికి చక్కా వచ్చేసింది. రెండు మూడు రోజాలు. ఈ విధంగా విడబాటు వస్తే, ఆ విడబాటును తీయటిబాధగా, తీరని వ్యధగా తన మొదటి వుత్తరంలో వర్ణిస్తూ లోకల్‌పోస్ట్‌లో భర్తకు రాయాలనే ప్లానుతో వచ్చింది.

కాని, వచ్చిన రోజు సాయంత్రమే మల్లె పూలపొట్లం పట్టుకుని రాజారావు వచ్చాడు. ఏదో పారిపోతున్నట్లుగా తన వెనకాలే వచ్చిన భర్తను చూడగానే సుందరి నీళ్లు కారిపోయింది.

మనసుల భాష

మర్నాడు కూడా వచ్చాడు. ఇక ఈ మనిషితో ఇలా లాభం లేదనుకుంది.

'మీరు రోజూ ఇలా వస్తే మావాళ్లేమన్నా అనుకుంటారు. నేనిక్కడ వుండే వెంరోజాల్లో మీరు నాలుగయిదు రోజాలకు ఒకసారి రాండి. మా బావ కూడ అంతే. వారానికొకసారి వస్తాడు.' అంది. ఇలా అనటం వల్ల తనవాళ్లను తానే పలచన చేస్తోందన్న విషయం సుందరికి తట్టలేదు. తట్టినా పట్టించుకోలేదు.

రాజారావు వెంటనే సమాధానం చెప్పాడు.

'మీ బావంటె పొరుగూరులో వుంటున్నాడు. అందుకని వారానికొకసారి వస్తాడు. ప్రక్కవీధిలో వుంటున్న నాకు ఆ కర్మేం పట్టింది. రోజూ రెండుపూటలా వస్తాను. ఇకపోతే మీవాళ్లు ఏమన్నా అనుకుంటారంటావు. మీ యింట్లో వుండి వేవార్పు తిండి తింటుంటె అనుకుంటారు. వూరికే నిన్ను చూడటానికి వచ్చినా అనుకుంటారూ; అనుకోనియ్. పెళ్లాన్ని చూడకుండా వుండలేడు అనేగా అనుకునేది. వెరీగుడ్—అది నాకెంతో క్రెడిట్.'

సుందరిని ఇంకా బాగా దగ్గరకు జరిగి భుజంమీద చేయివేసి, తన అంతరాంతరాలలో వున్న ప్రేమంతా మాటల్లో వుట్టిపడేటట్లుగా అన్నాడు: 'కాదు సుందీ, నిన్ను వరుసగా నాలుగయిదురోజాలు చూడకుండా నేను వుండగలనా? అది నాకెంతో కఠినాతి కఠినమైన శిక్ష తెలుసా! మన యింటినుండి ఆఫీసుకు పోవాలన్నా, ఆఫీసునుండి యింటికి పోవాలన్నా యిట్నుంచే పోవాలిగా. రోజూ ఆఫీసుకు పోయేటప్పుడు, ఆఫీసునుండి వచ్చేటప్పుడూ నిన్ను నాకళ్లార చూచుకుని కాసేపు మాటాడి వెళ్లిపోతాను సుందీ? వీళ్ల యింట్లో కాఫీ కాదుకదా, కనీసం వచ్చి మంచినీళ్లయినా త్రాగను చూడు. నిన్ను నా కళ్లార చూచుకోవటమే ఒక గొప్ప వరంగా భావిస్తాను.'

రాజారావు మాటలు పూర్తి అయ్యేసరికి సుందరికి కళ్లనిండుగా నీళ్లు వచ్చాయి. తన కన్నీటిని భర్త దృష్టి నుండి తప్పించుకోవటానికి మళ్లీ అతని భుజమే కావల్సి వచ్చింది. భర్త భుజం మీద తలపెట్టుకుని అతన్ని బల్లిలాగా కరచుకుపోయింది. తను పూర్తికే (వుత్తరాల మోజులో) అలా అన్నదికాని, తను మాత్రం తన దేముణ్ని చూచుకోకుండా వుండగలదా? అమ్మో!...

అప్పుడు అలా అనుకోవటానికి కారణం ఆ క్షణం కలిగించిన హృదయస్పందన; అంతరాంతరాల్లోని ప్రేమ బరువును మోసిన ఆ క్షణం యొక్క గొప్పదనము. కోటానుకోట్ల క్షణాలతో నిండిన తన జీవితంలో ఆ ఒక్క క్షణం మహత్తరమైనదని, మిగతా క్షణాలనుగూడ ఆ క్షణమంత మహత్తరంగా చేసుకోవటం తన చేతుల్లోనే వున్నదన్న విషయం సుందరి గ్రహించుకోలేక పోయింది. అజ్ఞాన వలనే ఈ రోజు కమలక్కయ్య బావ వుత్తరాలకోసం పడిన ఆరాటం, వుత్తరం వచ్చిన తర్వాత పడిన ఆనందం తన గుండెల్లో కుమిలింపుకు కారణమయింది. ఎలాగైనా భర్తను నాలుగురోజాలుపాటు యిక్కడకు రానీయకుండా చేద్దామనే ఆశతోనే మిగతా రోజాలుకూడ యిక్కడే వుండిపోయింది. అందువలనే గుండెల్లో నొప్పి అనే సాకుతో నెల్లాళ్లపాటు పుట్టింట్లో విశ్రాంతి తీసికోవటానికని వచ్చిన తనకు యింకా గుండెనొప్పి తగ్గటం లేదు.

చిన్నల్లుడు వారం రోజాల్నుంచి రోజూ రెండుపూటలా వస్తున్నా యిక్కడ కనీసం కాఫీగూడ త్రాగటం లేదన్న విషయం



సుందరి నాన్నగారికి ఆరోజా పుదయమే తెలిసింది. తొమ్మిదిగంటలకు ఆఫీసు కెళ్ళుతూ యిక్కడికి వచ్చిన రాజారావును మధ్యాహ్నం భోజనానికి రమ్మని గట్టిగా బలవంతంచేసి వప్పించారు. అందుకనే ఇందాక సీతమ్మ, 'మీ అయన కాకరకాయ వేపుడు తింటాడే!' అని అడిగింది. చిన్నల్లుడికి యిష్టమైన కూరలు చేసే ప్రయత్నంలో వుండి.

ఆ మధ్యాహ్నం భోజనాలు అయిన తర్వాత కమల మెల్లగా సుందరి పండుకున్న గదిలోకి వచ్చింది. కాసేపు ఆ మాటలు, ఈ మాటలు మాటాడి, 'సుంది, నీదగ్గరవున్న లెటర్‌పాడ్‌లోవి నాలుగు కాగితాలివ్వవే!' అని అడిగింది. కాగితాలు కోసం నాదగ్గరికి వచ్చావుకాని, నామీద ప్రేమవుండి వచ్చావా తల్లీ అని మనస్సులో అనుకుంటూ లెక్కపెట్టి నాలుగంటె నాలుగు కాగితాలు చించి యిచ్చింది.

'అబ్బ, ఎంత జాగర్తగా లెక్కపెట్టి మరీ యిస్తున్నావే? కాపోయినా నాకు తెలియక అడుగుతానుగాని నీవు ఎవరికి వుత్తరాలు రాస్తావనే ఆపాడ్ నీకు. అది నాకిచ్చేయరాదంటె!' అని అంది కమల, కాగితాలు తీసికొని బయటికిపోతూ.

ఆ మాటలు సుందరి గుండెల్లో ఎక్కడ తగలాలో అక్కడే తగిలాయి. అసలు తను ఎవరికి వుత్తరాలు రాస్తుంది? ఎవరికి తను రాసే వుత్తరాలు కావాలి...సుందరి గుండెలు మూగగా ఏడ్చాయి! తను ఉత్తరాలు తెగరాసేయాలని ముద్దులొలికే నీలి రంగు లెటర్‌పాడ్ కొత్తది కొనుక్కుని మరి వచ్చింది యిక్కడికి. ఆ కొత్త పాడ్‌లో సగం కాగితాలన్నీ కమలే తీసికుని వాటిమీద మొగుడికి వుత్తరాలు రాసుకుంది ఈవారం రోజుల్లో!

సాయంకాలం అయిదుకొట్టేవరకు కమల వుత్తరం రాస్తూనే వుంది. సుందరి రెండు మూడుసార్లు దొడ్లోకి వంటింట్లోకి వెళ్ళుతూ వస్తూ కమల గదిముందు తారట్లాడింది. మంచంమీద బోర్లా పడుకుని దిండుమీద కాగితాలు పెట్టుకుని జడ ముందుకేసుకుని కాళ్ళు పైకెత్తి వూపుతూ వుత్తరం రాస్తున్న కమలను చూడగానే సుందరికేలాగో అనిపించింది.

అక్కయ్య ఎంత అదృష్టవంతురాలు. అంత తన్మయత్వంతో అలా తన వారికి వుత్తరాలు రాసుకోవటం నిజంగా ఒక పుణ్యమనే అనుకోవాలి. తను ఆ పుణ్యానికి నోచుకోలేదు కదా!

కాలేజినుండి వచ్చిన చిన్న తమ్ముడు రవిని రైల్వేస్టేషన్‌కెళ్ళి ఆర్. ఎం. యస్‌లో వుత్తరం పోస్టుచేసి రమ్మని బ్రతిమాలుతుంది కమల.

మరీ చోద్యం కాకపోతే, రైలువెంబటి పరిగెత్తించట మేమిటి? రేపు వేయకూడదా? అంత అర్జంటు అనుకుంటె పోస్టుటైం కాకముందే వుత్తరం రాయటం పూర్తిచేయకూడదు— అనుకుంది సుందరి.

రవి కాసేపు గునిసి సైకిల్ ఎక్కి స్టేషన్‌కు పోయాడు.

సుందరి సూట్‌కేసు సర్దుకుని అత్తవారింటికి బయలుదేరింది. ఇంట్లో వాళ్ళంతా, ఇంత అకస్మాత్తుగా బయలుదేరావేమిటని గొడవ మొదలుపెట్టారు. మీరెంత గొడవచేసినా నేను ఈపూట వెళ్ళితీరవల్సిందే అని కూర్చుంది. పోనీ ఆఫీసు నుండి రాజారావు ఎటూ ఇప్పుడు వస్తాడు కదా, వచ్చిన తర్వాత యిద్దరూ కలిసి పోండని సీతమ్మ అంది. 'వస్తే వెళ్ళిపోయానని చెప్పండి,' అని రిక్షా పిలిపించుకుని వెళ్ళిపోయింది. వెళ్ళబోతూ, మిగిలిపోయిన లెటర్ పాడ్‌ను కమలకు యిచ్చివేసింది. ఎందుకే అంటె, 'నేనెవరికి రాస్తాను, నీవు బావకి రాయి. బావకి నీలిరంగు కాగితాల మీద రాసే నీ వుత్తరాలంటె యిష్టమన్నావుగా!' అని అంది.

కబురులేకుండా అకస్మాత్తుగా వచ్చిన కోడల్నిచూచి, 'అదేమిటమ్మాయి అప్పుడే వచ్చావు?' అని అంది ముసలి అత్తగారు.

'ఏం రాకూడదా?' అంది పెడసరంగా.

'రాకూడదని నేనెందుకంటాను తల్లీ!' అని, మళ్ళీ కోడలుకు పొయ్యిమీద బియ్యం పడేసింది.

స్నానంచేసి జడేసుకుంటూ అనుకుంది— ఎలాగూ ఈ మనిషి తనను చూడకుండా ఒక్కరోజుకూడ వుండలేడు. అమ్మగారింటి దగ్గరుండి లోకల్ పోస్టులో వుత్తర ప్రత్యుత్తరాలు జరపాలనుకున్న ఆశ అడియాశ అయిపోయింది. ఇలాటప్పుడు తనిల్లు వదులుకుని వాళ్ళ కొంపలో వుండటం దేనికి? అక్కడవున్న దగ్గర్నుంచి 'ఆ వుత్తరాల మనిషి' కమలక్కయ్యను చూస్తూ వుండాలి; తన దురదృష్టానికి కుమిలిపోతూ వుండాలి. వచ్చేయటమే మంచిదయ్యింది.

మర్నాడు సాయంత్రం రాజారావు ఆఫీసునుండి దిగులుగా వచ్చాడు. సుందరి కంగారుగా, 'ఏమిటి, ఏమయింది ఎందుకలా వున్నారు?' అని అడిగింది.

'హైద్రాబాద్‌లో మాకేదో ట్రైనింగ్ పెట్టారు. పదిహేనురోజులు అక్కడ వుండాలి. రేపే వెళ్ళాలి' అన్నాడు నీరసంగా.

సుందరి ఎగిరి గంతేసినంత పనిజేసింది. పట్టరాని సంతోషంతో వుబ్బి తబ్బిబ్బయిపోయింది. 'అయితే ఈ రాత్రికే వెళ్ళుతారా? రేపు ఉదయమా? హైద్రాబాద్ నుండి నాకేమి తీసికొస్తారు—' ఇలా ఏవేవో మాట్లాడింది వుషారుగా.

సుందరి వుషారు చూచేసరికి రాజారావుకు మతిపోయింది. తనను పదిహేను రోజులు వదిలి వుండటానికి సుందరి ఒప్పుకోదు, తనను పోవద్దని పట్టుబడుతుంది, అని అనుకున్నాడు. సుందరి కోసమయినా ఏదో వొక విధంగా ఈ ట్రైనింగ్‌కు వెళ్ళకుండా తప్పించుకోవాలని నిర్ణయించుకున్నాడు. కాని, తీరా సుందరి వుషారు హడావుడి చూస్తువుంటె, తనను ఈ రాత్రికే హైద్రాబాద్ బండి ఎక్కించేటట్లు వుంది. తనలాగే తనని చూడకుండా ఒక్కక్షణమైనా వుండలేదని వూహించుకోవటం పొరపాటే అయింది. ఈమధ్య సుందరి చాలా మారిపోయింది. మొన్నకూడ ఇంతే, తను వాళ్ళమ్మగారింటికొస్తాను అంటె వద్దు అని అంది. తనే వుండబట్టక రోజూ రెండుపూటలా వెళ్ళేవాడు. తనను గేటుబయట చూడగానే ఏదో షాక్ తిన్నట్లు క్రుంగిపోయేది. తనని కావాలని దూరంచేస్తోంది. ఎందుకిలా మారిపోయింది.

'ఏమిటి ఏదో తెగ ఆలోచిస్తున్నారు? సూట్‌కేసు సర్దనా? ఎన్నిజతలు పెట్టమంటారు?'

'కాదు సుంది, నిన్ను వదిలేసి ఎలా

వుండాలి? నేనే ట్రైనింగ్‌కు పోను—'

'బలేవారే! చిన్నపిల్లాడిలాగా మాట్లాడు తారేమిటి? ట్రైనింగ్ యిస్తాం రమ్మంటె పోను అంటారేమిటి? నేనేం అయిపో తాను. నన్నెవరూ ఎత్తుకుపోరు లేండి. తోడుగా మీ అమ్మగారుకూడ వున్నారుగా!'

రాజారావు నీరసంగా కుర్చీకి అంటుకు పోయాడు. ఇది తను పూర్తిగా ఆశించని సహించలేని జవాబు. సుందరి ఇలా మాట్లాడుతుందేమిటి?

'ఆఁ అన్నట్లు మర్చిపోయాను సుందీ! హైదరాబాదులో చాల గొడవలుగా వున్నాయి. అక్కడివాళ్ళంతా ప్రత్యేక తెలంగాణాకు ఆందోళన చేస్తూ నానా గొడవలు చేస్తు న్నారు. పేపర్లో చూడటంలా— అనేక అత్యాచారాలు జరుగుతున్నాయట. ఆంధ్రు ల్నితా వచ్చేస్తున్నారు—' ఈ దెబ్బతో సుందరి హడలిపోయి ట్రైనింగ్ వద్దూ, పాడువద్దూ, అని తప్పనిసరిగా అంటుంది అనుకున్నాడు.

సుందరి అలా అనలేదు. పకపక నవ్వి, 'మీరేదో అనుకున్నాను. వుత్త పిరికివారండి. ఆడపిల్లలాగా మాట్లాడుతున్నా రేమిటి? అక్కడ మిమ్మల్ని ఎవరేం జేస్తారండి. ఎవరన్నా వింటె నవ్వుతారు వూరుకోండి—' అంది.

రాజారావుకు విపరీతమైన కోపంవచ్చింది అక్కడంత ప్రమాదంగా వుందని తెలిసినా పోండి పోండి అని నెట్టుతోంది. తనకే మయినా అవుతుందనే భయం కాస్తకూడ లేదు. పైగా ఆడపిల్లా, పిరికివాడా అంటుంది. కడుపులో ఇంత కపటం పెట్టుకున్న మనిషికోసం, ప్రేమకోసం ఆశించటంకూడ పొరపాటే! ఏది ఏమైనా సరే తనీ రాత్రికే వెళ్ళిపోవాలి.

రాజారావు భోజనం కూడా చేయకుండా అప్పటికప్పుడే బయలుదేరాడు. సుందరి సంతోషంగా సాగనంపింది. రోజు విడిచి రోజు వుత్తరం రాయమని ఒకటికి పది సార్లు గట్టిగా నొక్కి నొక్కి చెప్పింది. హైదరాబాదులో అతని అడ్రసు అడిగి తీసికుంది, తనుకూడా రాయటానికి. పెద్ద ప్రేమ కారిపోతున్నట్లు వేధవ కబుర్లు అని మనస్సులో అనుకుంటూ రిక్షాఎక్కి వెళ్ళిపోయాడు బస్సుస్టాండింగ్‌కు.

తన చిరకాల వాంఛితం ఈ విధంగా నెరవేరబోతుంది కదా అని సుందరి తెగ సంబరపడిపోయింది.

మర్నాడు ఉదయమే కాఫీలు త్రాగటం అవగానే భర్తకు 'ప్రేమలేఖ' వ్రాయటం మొదలుపెట్టింది. గడిచినరాత్రి వంటరిగా తనెంత విరహాన్ని అనుభవించిందీ, చంద్రుడు తనని ఎలా వెక్కిరించింది, వెన్నెల ఎంత వేడిగా సోకిందీ, నిద్రలో తనెన్నిసార్లు ప్రక్కన తనకోసం తడుము కుంది—వున్నవి లేనివి కల్పించి అన్నీ రాసే సింది. ఆ వుత్తరం ఆ రోజంతా రాస్తూనే వుంది. మర్నాడు పోస్టుచేద్దామంటె ఆది వారమయిపోయింది. మళ్ళీ ఆయివారు 'తాజాకలాలు' రాసింది.

సోమవారంనాడు ఆ వుత్తరాన్ని పోస్టు డబ్బాలో పడేసింది. ఆ క్షణంలో, ప్రపం చంలో తనంత అదృష్టవంతురాలెవరూ వుండరని వూహించుకుంది. ఆరోజు పెద్ద పండుగ చేసుకున్నంతగా సంబరపడి పోయింది. శనివారంనాడు వుత్తరం పోస్టు చేస్తే సోమవారం అందుతుంది. ఒకవేళ భర్త దగ్గర్నుంచి జాబు వస్తుందేమోనని పోస్టుమేన్‌కోసం ఎదురు చూచింది ఆరోజు. కమలక్కయ్యేకాదు తనుకూడ పోస్టుమేన్ కోసం ఎదురుచూస్తూ వుందన్న భావం ఆమెకెంతో గర్వాన్ని కలిగించింది. ఎదురు చూచిన పోస్టుమేన్ ఎదురింట్లో వుత్త రాలు యిచ్చి కనీసం యిటుకేసి కూడ చూడకుండా చక్కాపోయాడు. సుందరి కొన్నిక్షణాలు దిగాలుపడిపోయింది. అయ్యో ఈ మనిషికి ఆ ధ్యాసవుంటే యిక అను కునేదేముంది అని మనస్సులో అనుకుంది.

రెండురోజుల తర్వాత అంటే బుధ వారం నాడు దీపాలు పెట్టిన తర్వాత సుందరి తన భర్తకు రెండో వుత్తరం రాయటానికి కాగితం పెన్ను తీసికొని కూర్చుంది. అత్తగారు దొడ్లో తులసికోట గూటిలో దీపం పెట్టుతూవుంది. ఇంతలో వీధి తలుపు చప్పుడయింది. సుందరి వినుక్కుంటూ లేచి వెళ్ళి తలుపు తీసింది. తలుపుతీసి ఎదురుగుండా కనిపించిన దృశ్యం చూచి ఆశ్చర్యపోయింది. నోటి వెంట మాటకూడ రాలేదు. ఎదురుగుండా రాజారావు వున్నాడు. ఎలా వున్నాడు. పెరిగిన గడ్డంతో, మాసిపోయిన గుడ్డలతో, చెరిగి పోయిన చిందర వందరగావున్న క్రాపుతో బికారిలాగా వున్నాడు. వుత్తచేతులతో వచ్చాడు. వెంట తీసికెళ్ళిన సూటుకేస్, ఎయిర్‌బాగ్ లేవు.

మెల్లగా లోపలికివచ్చి కుర్చీలో కూల బడ్డాడు. దొడ్లోంచి లోపలికి వస్తూ కుర్చీలో పిచ్చివాడులాగ కూర్చున్న కొడు కును చూచి ముసలమ్మ కంగారుపడి పోయింది. కొడుకును కావలించుకున్నంత పనిచేసి, 'ఇదేమిట్రా నాయనా, ఇదేమిట్రా తండ్రీ!' అని బావురమన్నది. కాస్సేపటికి మెల్లగా మంచినీళ్ళు కావాలని అడిగాడు. సుందరి లోపలి కెళ్ళి తీసికొని వచ్చింది.



మనసుల భాష

భార్యను మిరిమిరి చూస్తూ గ్లాసందు కున్నాడు. ఆ చూపుకు సుందరి భయపడి పోయింది.

నీళ్ళు త్రాగిన తర్వాత మాటాడ టానికి కాస్త ఓపికవచ్చింది.

జరిగిందేమిటంటె—రాజారావు హైద్రా బాద్‌కు వెళ్ళిన మర్నాట్నుంచి అక్కడ అల్లర్లు పెచ్చురేగిపోయాయి. ప్రత్యేక తెలంగాణాకోసం సత్యాగ్రహకులు ఆందో ళన జరుపుతుండగా గుండాలు ఎక్క డ్నుంచి వచ్చారో ఎలా వచ్చారో గాని రంగంలోకి దిగారు. దౌర్జన్య చర్యలకు దిగారు. పోలీసులకు ఆందోళనకారులకు మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు కాల్పులు జరిపారు. ఎంతో మంది చని పోయారు. అంతా అల్లకల్లోలమై పోయింది. కర్ఫ్యూ కూడా విధించారు. రాజారావు రెండురోజులు తిండిలేక హోటల్ గదిలోనే వుండిపోయాడు. మంచినీళ్ళు త్రాగి పొట్ట నింపుకున్నాడు. బయటికి రావటానికి కర్ఫ్యూ అమలులో వుంది. మూడోరోజు వుదయం యిడ్లీలు తెచ్చు కుని తింటుండగా రౌడీమూకలు అతని రూం మీద దాడి చేశారు. చేతినున్న వాచీ, వుంగరం, పర్సు, బట్టలు, సూటుకేసు-వంటిమీద వున్న గుడ్డలు తప్ప మిగతా వన్నీ ఎత్తుకుపోయారు. కొడు దర్జాగా సెచుకొని పోయారు. ఆఖరికి సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె కూడ తీసికున్నారు. కట్టుబట్టలతో పూరుగాని వుళ్ళో

రెండు రోజులపాటు దుస్తులతో నకనక లాడుతున్న కడుపుతో వడిరోడ్డున విల బడ్డాడు. హోటల్‌వాడి బిల్లు పూరెళ్ళి పంపిస్తాను అంటె వాడు పాపం సరే అని వప్పుకున్నాడు. హైద్రాబాద్ అంతా పిచ్చికుక్కలాగా తిరిగాడు. అలా తిరుగు తుంటె తన కాలేజిమేట్ ఒకడు కనిపిం చాడు. అతని దగ్గర ఇరవై రూపాయిలు తీసికొని బయలుదేరాడు. బస్సులు లేవు. తుపాను మూలంగా రైళ్ళు అంతకు ముందే ఆగిపోయాయి. ఒకరోజంతా కొంతదూరం లారిలోను, కొంతదూరం చిన్న కారులోను, మరికొంత దూరం బస్సులోనూ ప్రయాణం చేసి చావు తప్పి కన్ను లొట్టపోయి ఎట్టకేలకు యింటికి జేరుకున్నాడు. వెళ్ళినరోజు తప్ప మళ్ళీ ట్రైనింగు ఆఫీసు మొగం కూడ చూడ లేదు.

అంతా విని రాజారావు తల్లి మళ్ళీ బావురుమంది. 'బిడ్డ వెళ్ళనే అన్నా డమ్మా. మహాతల్లి ఈవగారు వెళ్ళు వెళ్ళు అని ముడ్డిపట్టుకుని నెట్టింది.' అని కాసేపు ఏడ్చింది.

వేడినీళ్ళ స్నానం చేసి, కాస్త మజ్జిగ అన్నం తిని గదిలో మంచం మీద పండు కున్నాడు. స్నానం దగ్గరకు, భోజనం దగ్గరకు సుందర్ని రానీయలేదు. దగ్గరకు వస్తేనే చాలు కసురుకున్నాడు.

సుందరి గుడ్లనీళ్ళు గుడ్ల కుక్కు కొని ముంచుకొస్తున్న ఏడ్పును వంటి బిగువున ఆపుకొని ఎలాగో గడిపింది. దేనికో గదిలోకి వెళ్ళి, మంచం మీద బల్లిలాగా కరుచుకుపోయి పండుకున్న భర్తను చూడగానే దుఃఖం ఆపుకోలేక పోయింది. అతడ్ని వాటేసుకుని బావుర మంది. అలా ఎంతసేపు ఏడ్చిందో.

భర్తే జాలిపడి చివరికి సుందర్ని ఓదార్చవలసి వచ్చింది. సుందరి కుదట బడిన తర్వాత చేతో మెల్లగా వీపుమీద రాస్తూ, 'ఎందుకని సుంది, ఈ మధ్యన నీవు ఇలా మారిపోయావు? నేనేం తప్పు చేశానని నన్నిలా దూరదూరంగా పెట్టు తున్నావు' అని అడిగాడు.

ఏమని సమాధానం చెప్తుతుంది ? మళ్ళీ వెక్కి వెక్కి ఏడ్చింది.

'ఇందాక అమ్మ మరీ బెంబేలు పడి పోతుందని చెప్పలేదుగాని. ఒకచోట ఫైరింగ్ జరుగుతున్నప్పుడు నేనొక షాపు చూరు కింద నిలబడ్డాను. నా కళ్ళెదుట తుపాకి గుండు తగిలి నలుగురు అక్కడి కక్కడే నేలకూలారు. ఆ గుండే నాకు తగిలివుంటె—'

మాట పూర్తి చేయనీయకుండా సుందరి భర్త నోరు చేతితో మూసేసింది. మంగళ సూత్రాలు తీసి కళ్ళ కద్దుకుంది.

భర్తను కరచుకుని పండుకుని మెల్లగా తనకు వున్న 'ప్రేమలేఖల పిచ్చి'ని గురించి, కమలక్కయ్యకు వుత్తరాలు వచ్చే విషయం, తనకున్న మోజు తీర్చుకోవటానికి గుండె నొప్పి సాకుతో వుట్టింటికి వెళ్ళటం, ఆ మోజులోనే అతన్ని హైద్రాబాద్‌కు పొగ నంపటం—అన్నీ వరుసగా చెప్పింది.

అంతా విన్న తర్వాత రాజారావు పక పక నవ్వి, 'పిచ్చి బొంద!' అని అంటూ ఇంకా దగ్గరకు లాక్కున్నాడు. అతని గుండెల మీద తల పెట్టి పండుకున్న సుందరి అనుకుంది, ఈయన గుండెలు, 'నిన్ను ప్రేమిస్తున్నాను. నిన్ను ప్రేమి స్తున్నాను' అని అంటూ ఎన్నో ప్రేమ రహస్యాలు ఇంత స్పష్టంగా పలుకు తుంటె, ఇంకా వుత్తరాలతో పనేమిటి? మనసును పలికించలేనివారికి, మనసు పలికే ప్రేమభాషను అర్థంచేసుకోలేని వారికి వుత్తరాలు, పత్తరాలూ కావాలి గాని మాకు దేనికి? ●